# భూతద్దం

“గోత్రం ఏమిటన్నారూ?”

“శ్రీవత్స”

“మరింకేం - వాళ్ళది భారద్వాజస గోత్రం. బేషుగ్గా మాట్లాడుదాం”

“మీరే చూడాలి - మా అమ్మాయి టెన్త్‌క్లాసు ఓ సబ్జక్టులో తప్పింది. మళ్ళీ కట్టిద్దామనుకుంటున్నాం. అయినా మనపిల్ల ఉద్యోగం చెయ్యాలని, ఊళ్ళు ఏలాలనీ మనకి లేదు. ఏదో యిల్లు సర్దుకోగలిగితే చాలు”

“బాగా చెప్పారు. వాళ్ళు కూడా అలాంటి పిల్లే కావాలనుకుంటున్నారు. సంప్రదాయకమైన కుటుంబం.”

"పిల్లాడేం చేస్తున్నాడు;"

"ఆర్.టి.సి.లో ఉద్యోగం"

"ఏం ఉద్యోగం ?"

"ఆ....ఆఫీసులో గుమాస్తా"

"మంచిది"

"కాస్త అటో యిటో కుదిరేట్టు చూద్దాం"

"మీ దయ"

"భలేవారే మీరంతగా చెప్పాలా !"

"మీకు తెలియనిదేమీలేదు. యజ్ఞయాగాదులు చేసిన కుటుంబం. నాకు అలాంటిలాంటి యింట్లో పిల్లనివ్వడం యిష్టం లేదు. ధనధాన్యాలకన్న సంప్రదాయం ముఖ్యం. పిల్లాడి తరపు వాళ్ళంతా పండితులని విన్నాను" అన్నాడు సోమయాజులు.

"మరే. మరే. వాళ్ళ ముత్తాతగారు మాడుగుల ఆస్థానంలో మహాపండితుడు ఏడు తరాలుగా వాళ్ళ వంశం రాజపూజితం" అన్నాడు బ్రహ్మగారు.

సోమయాజులికి దప్పమీద దెబ్బపడినట్టయింది.

"అదే—అదే మహా ప్రసాదం" అన్నాడు ఆనందంతో.

నేను వాకబు చేసి చెప్తాను" అంటూ బయలుదేరాడు బ్రహ్మగారు.

"మంచిదండి. దయుంచండి" అంటూ వినయం ప్రకటించాడు సోమయాజులు.

* * *

రామకృష్ణ ఆఫీసులోకి వస్తూనే పరాశర్ దగ్గరికి వెళ్ళాడు. అతన్ని చూడగానే పరాశర్ ఆనందంగా-

"ఏమిటి రామకృష్ణా ! డ్యూటీ అయిపోయిందా - యిటు వచ్చావు" అన్నాడు.

"ఇప్పుడే దిగాను గానీ, పోయిన నెల నా టి.ఏ. బిల్లు కలవలేదు. కొంచెం చూడు గురూ" అన్నాడు.

"చూస్తాలేగాని - ఇక ముందు నేను ఆఫీసులో వుంటానో లేదో -"

"ఏం ? ఎందుకని" అన్నాడు రామకృష్ణ.

"అవుటాఫ్ డిజిగ్నేషన్ ఆఫీసుల్లో వుండనివ్వద్దనీ కండక్టర్సు అందర్నీ లైన్ మీదకి పంపమని డి.వి.యమ్ గారి ఆర్డర్సు"

"అయితే మరెలా ?"

"ఏముంది ? రేపట్నించి టిక్కెట్లు ట్రే పట్టుకుని బయలుదేరడమే"

"మంచిదే లెద్దూ"

"మంచిదే కానీ నాకో సమస్య వచ్చిపడింది" అన్నాడు పరాశర్ సంశయముగా.

"ఏమిటి ?"

"నేను ఆర్టీసీలో గుమాస్తాగా పనిచేస్తున్నానని చెప్పి మా వాళ్ళు నాకు పెళ్ళి సంబంధం కుదిర్చారు. అంతా మాట్లాడుకుంటున్నారు. రేపు తాంబూలాలు పుచ్చుకుంటారు."

"అయితే ఏమిటి ?"

"నేను కండక్టరునని తెలిస్తే వాళ్ళేమనుకుంటారో"

"ఏం కండక్టరు ఉద్యోగం ఉద్యోగం కాదా ?"

"నీకర్థం కాదు నా బాధ. మా యింట్లో అంతా వట్టి ఛాందసభావాలు కల వాళ్ళే - ఇదేదో మా వంశ ప్రతిష్టకి భంగం అనుకుంటారు" అన్నాడు.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్ ?"

"అదే ఆలోచిస్తున్నా" -

"సరే నేను డ్యూటీ దిగివస్తున్నా-ఆకలి మండిపోతోంది నే వెళ్తా – సాయంత్రం కలుద్దాం" అంటూ వేగంగా రామకృష్ణ వెళ్ళిపోయాడు.

*　　*　　*

రామకృష్ణ, పరాశర్ ఒకే కులం కాకపోయినా వారి మధ్య అలాంటి భేద భావం ఎప్పుడూ లేదు. సెకండ్ ఫారం నుండి కలిసి చదువుకున్నారు. కలిసి తిరిగారు. కలిసి ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఇద్దరికీ ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసు.

పరాశర్ కుటుంబం బాగా సనాతన సంప్రదాయాలుగల కుటుంబం. కించిత్ మూర్ఖత్వం మరికొంచెం గర్వం—మనలాంటి వారు పృథివి మీద లేరనే అహం

భావం-అన్నీ కలగాపులగంగా వున్న ఆ కుటుంబం ఆర్థికంగా మాత్రం బాగా చితికిపోయి వుంది. నలుగురన్నదమ్ములు. ఇద్దరప్ప చెల్లెళ్ళు, ఆడపిల్లలు పెద్ద వాళ్ళు కావడంవల్ల పెళ్ళిళ్లయి అత్తారిళ్ళకు వెళ్ళిపోయారు. తండ్రి వేదపండితుడు, పురోహితుడు.పరాశర్‌కి పంధొమ్మిదేళ్ళు నిండేసరికి అతని తండ్రికి డెభై నిండాయి. పెద్ద కొడుకు తండ్రి వారసత్వంగా పౌరోహిత్యం తీసుకున్నా, పెళ్ళయిన మర్నాడే భార్య సలహామేరకు వేరే కాపురం పెట్టాడు. మిగిలిన యిద్దరూ పొరుగూళ్ళలో చిన్న చిన్న ఉద్యోగాలేవో చేసుకుంటున్నారు. చివరివాడు పరాశర్ బి.ఎస్.పి. ప్యాసయినా ఉద్యోగమేమీ దొరకలేదు. అప్పుడే రామకృష్ణతో కలిసి ఆర్.టి.సి.లో కండక్టర్ ఉద్యోగానికి ప్రయత్నం చేశాడు. దానికి కావలసిన సహాయమంతా రామకృష్ణే చేశాడు. క్యాజువల్ కండక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే తండ్రి నోటికి జడిసి, డిపో మేనేజర్ మంచితనంవల్ల ఆఫీసులో పని చేస్తూ తనకి ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం అని చెప్పుకుంటున్నాడు పరాశర్.

ఉద్యోగం వచ్చిన మర్నాటి నుండి తల్లీదండ్రి పెళ్ళి గురించి పోరు మొదలుపెట్టారు. ఎన్నోసార్లు విసుక్కున్నా, కసిరినా వారి ధోరణి మారడం లేదు.

"ఒరేవ్ ! పరాశరా ! నీ పెళ్ళి కూడా అయితే నాకు నిశ్చింతగా వుంటుందిరా" అంటాడు తండ్రి.

"అవున్నాయనా నాకూ ఓపిక లేదు. కోడలొస్తే కాస్త సాయంగా వుంటుంది" అంటుంది తల్లి.

ఆర్థిక స్థితి ఎలా వున్నా, సంప్రదాయాలు, సరదాలు, ఆనవాయితీలు అన్నీ యధావిధిగా జరగాలనుకునే మనుషుల మధ్య పరాశరేమీ మాట్లాడలేక పోయాడు.

"నీకు బుద్ధి లేదు" అన్నాడు రామకృష్ణ. పరాశర్ తలొంచుకున్నాడు.

"లేకపోతే కండక్టర్ ఉద్యోగమేం పరువు తక్కువనుకుంటున్నావా" అన్నాడు రామకృష్ణ.

"లేదు లేదు. నేనెప్పుడూ అలా అనుకోలేదు. నాకు డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే తెలుసు" అన్నాడు పరాశర్.

"అయితే నీ ఉద్యోగానికి నువ్వు గర్వపడు. నీ వృత్తిని నువ్వు ప్రేమించి,

అభిమానించు. చిత్తశుద్ధితో పనిచెయ్యి అంతేగానీ యిలాంటి అవమానకరమైన ఆలోచనలు చెయ్యకు" అన్నాడు రామకృష్ణ తీవ్రంగా.

"మా యింట్లో మనుషుల్ని ఒప్పించలేను. మా నాన్నగారు మన యింటా వంటా లేదు కండక్టరు ఉద్యోగం చెయ్యడం అంటూంటే నేనేం చెప్పను ?"

"అవును ఎలా వుంటుంది ? వంద సంవత్సరాల క్రితం బస్సులు కండక్టరు ఉద్యోగాలు ఎక్కడున్నాయి. అప్పుడు రోడ్లే లేవు. అప్పుడు లేనివెన్నో యిప్పుడు వున్నాయి-అందుకని అవన్నీ వద్దనుకుంటామా. మనిషి నిలిచిపోతానంటే నాగరికత నిలబడిపోదు. నీతి నిజాయితీ నిలబెట్టుకోవడం గొప్ప సంప్రదాయం గాని ఫలానా వృత్తి చేయడం మాత్రమే మంచి సంప్రదాయం అనుకోకూడదు.

"నాకివన్నీ తెలుసు కాని యివన్నీ చెప్పడానికి మా యింట్లో ఎవరూ వినరు.

"అయితే ఏం చేస్తావు ?"

"ఏమీలేదు-ముందే పెళ్ళి ఆపెయ్యాలి"

"ఏం ? వాళ్ళు యిలాంటి వాళ్లేనా.

"ఆహా యజ్ఞయాగాదులు చేసినవారట"

"అందుకే ముందు వాళ్ళకెళ్లి చెప్పేయ్"

"అవును, నేనూ అదే అనుకుంటున్నాను"

"వద్దనుకుంటే వారే ఆగిపోతారు.

"నిజమే – ఎందుకంటే వంద అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యాల్సిన రోజులు కావివి. ఒక్క నిజం చెప్పి వంద పెళ్ళిళ్ళు ఆపినా ఫరవాలేదు. ఈ రోజుల్లో" అన్నాడు రామకృష్ణ.

పరాశర్ ఆలోచిస్తుంటే—

"నీకు తెలియదేమో మొన్నో తమాషా జరిగింది. మన గ్యారేజీకి దూరంగా కొత్తగా ఒక టీ స్టాల్ వెలిసింది. ఆ చుట్టుపక్కలేమీ లేకపోవడంతో మంచి బేరం సాగుతోంది. వారం రోజుల్లో అతనొక్కడే అన్నీ చూసుకుంటూ వుండేవాడు. మరీ పని ఎక్కువైంది. ఒక రోజున భార్యని తీసుకొచ్చి కొట్లో కూర్చోబెట్టాడు. కేవలం డబ్బులు తీసుకోవడమే ఆమె పని. టీ అతనే తయారు చేసేవాడు. అతనే సర్వ్ చేసేవాడు. చివరికి కప్పులు కూడా అతనే కడిగేవాడు. అంతే - మర్నాడు

ఆ పిల్ల నిచ్చిన పెద్దమనిషి రంకెలేసుకుంటూ వచ్చాడు. "మూడు వేలు కట్న మిచ్చాను. నా కూతుర్ని బడ్డీ కొట్లో కూచోబెడతాడా" అని గొడవ చేశాడు. పాపం! అల్లుడు కాస్త అమాయకుడు - మెతకవాడు - భయస్తుడు - అంతే కొట్టు మూతపడింది. ఇంతకీ ఆ పెళ్ళామే వెళ్ళి వాళ్ళ నాన్నతో చెప్పిందట. ఆడ వాళ్ళకు ఒక్కొక్కసారి ఫాల్స్ ప్రెస్టీజీ వుంటుంది. కాబట్టి ..."

"చాలు అర్థమైంది తర్వాత గొడవలకన్నా ముందే నయం" అన్నాడు పరాశర్ తేలిగ్గా.

* * *

సోమయాజులు ఆశ్చర్యంగా తెల్లబోయి, ఆ కుర్రాడివైపు చూస్తుండి పోయాడు అతను చెప్పిన విషయాలు విని అర్థం చేసుకోవడానికి అయిదు నిము షాలు పట్టిందాయనకి. పరాశర్ ఇబ్బందిగా కదిలాడు. సోమయాజులు తేరు కున్నాడు.

ఆయన ముఖంలో విచిత్రమైన ఆనందం, గర్వం తొణికిసలాడాయి.

"మంచిది బాబూ! ఈ రోజు నాకెంతో గర్వంగా వుంది. ఇంత నిర్భ యంగా, సంకోచం లేకుండా, వున్నదున్నట్లు చెప్పావు. నిజమే తప్పుకాని విష యాలు కూడా వారి వారి ఆలోచనబట్టి తప్పుగా అనిపిస్తాయి, అదంతా తెచ్చిపెట్టు కున్న బడాయి, ఆడంబరమూను"

"ఏది ఏమైనా...."

"ఆగు నే చెప్పేది పూర్తిగా విను నాయనా! నాకేమీ అభ్యంతరంలేదు. నా కూతుర్ని నీకు సగర్వంగా యిచ్చి పెళ్ళి చేస్తాను. నువ్వు పరువుగల ఏ ఉద్యో గం చేసినా నాకభ్యంతరం వుండదు. అదీ ఈ క్షణంలో నాకు కలిగిన కనువిప్పు ఇంత నిజాయితీగా వున్న నిన్ను ఛాందసంతో వదులుకోవడం తెలివి తక్కువ తనమే అవుతుంది. రేపు తాంబూలాలు పుచ్చుకుందాం. నువ్వు నిశ్చింతగా వుండు"

"చాలా థాంక్సండీ. మీరు లేని సమస్యని భూతద్దంలో చూస్తారని భయ పడ్డాను. నా మనసులో అనుమానం తీరిపోయింది. వస్తానండీ" అంటూ లేచాడు పరాశర్.

"కాస్త కాఫీ పుచ్చుకుని వెళ్ళవుగాని ....

"ఫరవాలేదండీ - వస్తాను" అంటూ బయటపడి దూరంగా తనకోసం ఎదురుచూస్తున్న రామకృష్ణని కలుసుకున్నాడు పరాశర్. (ప్రస్థానం)